క్లుప్తంగా

డ్రగ్స్‌ను అంతం చేయడమే లక్ష్యం



5కే రన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): డ్రగ్స్‌ను అంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహిస్తున్న 5కే రన్ పోస్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. డ్రగ్స్‌కు యువత బానిస కావద్దని, డ్రగ్స్ వినియోగించే, విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్లరూరల్ సీఐ సదన్ కుమార్, ఇల్లంతకుంట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పులి కృష్ణ, అంతగిరి వినయ్ కుమార్, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆకుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



పంట పొలాలు పరిశీలిస్తున్న అధికారులు

కోనరావుపేట: రైతులు వరిపంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని శివంగాలపల్లిలో నోముల జితేందర్ రెడ్డి జిల్లా వ్యవసాయాధికారుల సహకారంతో డ్రమ్‌సీడర్ ద్వారా వరిపంటను వేశారు. రైతులు బిక్కనూరి శ్రీనివాస్, జంగం రాజు, నోముల రఘుపతి పొలాలను సందర్శించగా వరిలో కాండం తొలిచే పురుగును గమనించి, నివారణకు తగు సూచనలు చేశారు. మొగిపురుగు నివారణకు సిపారసు చేయబడని ఇతర 3గ్రాముల సేంద్రీయ గుళికలను యూరియాతో కలిపి వేయడంతో ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.

పేదలకోసమే పథకాలు

వేములవాడరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకంలో రూ.500 లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మల్లేశం, బొడ్డు రాములు, రొండి రాజు, వేణు, శ్రీకాంత్, చిలుక ప్రభాకర్, ఎల్లయ్య, జాగిరి సురేశ్, నాగుల మల్లయ్య, నర్సయ్య, తదితరులున్నారు.

విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



వీర్నపల్లి: ఇంటర్మీడియట్, డిగ్రీ వార్షిక పరీక్ష నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా మైక్, డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేశ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రార్థనా మందిరాల్లో మైక్ శబ్దాలుపెడితే పిల్లల చదువుకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మండలంలోని యు వకులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

రుద్రంగి: నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డీజే, మైకులతో విద్యార్థులకు శబ్దకాలుష్యం ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ అన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చీల్లో మైకులు పెట్టకూడదన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్దోగం



వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామంలో గౌడ కులస్తులు ఎల్లమ్మ సిద్దోగం పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు, నాయకులు మనోహర్ రెడ్డి, కౌన్సిలర్ నిమ్మిశెట్టి విజయ్, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, శ్రీధర్ గౌడ్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు.

గోడ గడియారాలు అందజేత

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన ఇరిగి భాను ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎనిమిది గోడ గడియారాలు అందించారు. ప రీక్షల సందర్భంగా కళాశాలలోని ప్రతి హాల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రిన్సిపాల్ వెంకట్ నాయక్‌కు గోడ గడియారాలు అందించారు.

పరీక్షల్లో భయం వీడేలా..

- 'పది' విద్యార్థులకు 'ప్రేరణ'
- వ్యక్తిత్వ వికాస నిపుణులతో తరగతులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు

గంభీరావుపేట(సిరిసిల్ల): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో భయం వీడేలా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషన్ (ప్రేరణ) తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశారు. కొంత మంది విద్యార్థులు బాగా చదివినా పరీక్ష హాల్‌లోకి వెళ్లగానే భయంతో పరీక్షలు బాగా రాయలేకపోతున్నారు. తద్వారా చదువులో వెనుకబడిపోతున్నారు. కాగా విద్యార్థులు భయం వీడి పరీక్షలు ప్రశాంతంగా రాసేలా వ్యక్తిత్వ వికాస నిపుణులతో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

మార్చి18 నుంచి పరీక్షలు

విద్యార్థులు చదువుకున్న పాఠశాలలోనే ఇప్పటివరకు పరీక్షలు రాసినా వార్షిక పరీక్షల కోసం ఇతర పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది. కొత్త వా తావరణం, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ తనిఖీలతో వి ద్యార్థులు భయాందోళనకు గురై పరీక్షలు బాగా రా యలేకపోతుంటారు. ఇలాంటి భయాలను వీడి వి ద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాసేలా మోటివేషన్ కల్పిస్తున్నారు. మార్చి18 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వారం రో జులుగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో పా టు మానసిక నిపుణులతో మోటివేషన్ నిర్వహిస్తున్నారు.

14 పాఠశాలలు.. 478 మంది విద్యార్థులకు

మండలంలోని 14 ఉన్నత పాఠశాలలకు చెందిన 478 విద్యార్థులకు మంగళవారం గంభీరావుపేట మండలకేంద్రంలోని దత్తసాయి ఫంక్షన్ హాల్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మధుసూదన్ రెడ్డి, రాజేశ్వర శాస్త్రి విద్యార్థులకు ప్రేరణ కల్పించారు.

గురుకుల విద్యార్థులకూ..

మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రముఖ వ్యక్తిత్వ నిపుణుడు ఎర్ర ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు పరీక్షల్లో భయం పోగొట్టేలా ప్రేరణ కల్పించారు.

భయం వీడాలి



విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి. తెలిసిన విషయాలను నిర్భయంగా రాసేలా విద్యార్థులను మోటివేట్ చేశాం. ప్రణాళికబద్ధంగా చదవడం, టైం టేబుల్ నిర్ణయించుకొని దాని ప్రకారం చదవడంతో మంచి ఫలితాలు సాధించవచ్చు. పదో తరగతి తర్వాత ఉన్నత చదువుల కోసం లక్ష్యాన్ని నిర్ణయించుకునేలా అవగాహన కల్పించాం.

– మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. లక్ష్య సాధనలో ప్రతి సబ్జెక్టు కీలకంగా ఉంటుంది. సమయం ప్రకారం సమతుల్య ఆహారం తీసుకుంటూ చక్కని ప్రణాళికతో చదవాలి. పరీక్షలంటే భయపడితే జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవలి. సమాధాన పత్రాల్లో కొట్టివేతలు లేకుండా చక్కగా రాయాలి.

– ఎర్ర ప్రవీణ్ కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు

విద్యార్థులకు దోహదం



వార్షిక పరీక్షలంటే విద్యార్థులకు భయం ఉంటుంది. వారిలో భయం పోగొట్టేందుకు ప్రధానోపాధ్యాయులమంతా మోటివేషన్ క్లాసులు ఏర్పాటు చేశాం. నిర్భయంగా పరీక్షలు రాసేందుకు దోహదపడుతాయని భావిస్తున్నాం. విద్యార్థులు మానసికంగా పరీక్షలకు సిద్ధమయ్యేలా అవగాహన కల్పించాం. దీంతో మెరుగైన ఫలితాలు సాధిస్తారని భావిస్తున్నాం.

– గంగారాం, ప్రధానోపాధ్యాయుడు,లింగన్నపేట

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: గృహజ్యోతి, ఉచిత విద్యుత్ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించిన సందర్భంగా మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో గ్రామశాఖ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు.అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం మరో రెండు పథకాలు అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్ రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, నాయకులు సాహెబ్, గోగూరి శ్రీనివాస్ రెడ్డి, పందిర్ల సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అందించిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పంపిణీ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 827 మంది విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. గివ్ ఏ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఆకునూరి శంకరయ్య, కౌన్సిలర్లు వెల్దండి దేవదాస్, గెంట్యాల శ్రీనివాస్, నాయకులు సబ్బని హరీశ్, సామల శ్రీనివాస్, తదితరులున్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం



సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ శ్రీరాములు

సిరిసిల్లటౌన్: క్షయ నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కృషి చేస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌వో, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీరాములు అన్నారు. జిల్లాలో ఐదు ముక్త్ టీబీ గ్రామాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. శివంగలపల్లె, సర్దాపూర్, కంచర్ల గ్రామాల ఆస్పత్రులను వైద్య బృందంతో కలిసి సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు వేణుగోపాల్, స్రవంతి, స్నేహ, డీపీపీఎం బిగిందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

రుద్రంగి: మండల అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ప్రత్యేక నిధులు (ఎస్‌డీఎఫ్) రూ.59 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిధుల మంజూరుపై కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

చందుర్తి: మండలంలోని పలుగ్రామాల అభివృద్ధికి రూ.కోటి 4లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి తెలిపారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలతో పాటు స్వశక్తి భవనాలు, తాగునీరు, బోరుబావులకు మోటార్లు వినియోగించుకునేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ కేసీఆర్ కాలనీలో నివాసముంటున్న శ్రీగాధ భాస్కర్ మొదటి అంతస్తునుంచి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. బాధితునికి చేయూత మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందించారు. ఫౌండేషన్ సభ్యులు దూస శ్రీనివాస్, వడ్నాల ఆంజనేయులు, బాద గోపి, శ్రీ. దర్, నాగరాజు, సిద్దిరాములు, సాయిరెడ్డి, లక్ష్మీ నారాయణ, సుంకి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని శ్రీసాయి వేంకటేశ్వర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అర్హులైన 20 మంది మహిళలకు ఉచితంగా సిలిండర్లను పంపిణీ చేశారు. మేనేజర్ నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి గౌస్ పాషా ఆధ్వర్యంలో వైద్య రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బండి ఉపేందర్, ఉ పాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్ష సామగ్రి పంపిణీ

తంగళ్లపల్లి: గిఫ్ట్ ఏస్మైల్‌లో భాగంగా తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మంగళవారం ఎంపీపీ పడిగెల మానస పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు పెద్దూరి తిరుపతి, పడిగెల రాజు, జగన్, రామాగౌడ్, అనిల్, రమేశ్, హమీద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

ముస్తాబాద్: ముస్తాబాద్ జెడ్పీ బాలుర పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులు ప్రదర్శనలు చేపట్టారు. మండలంలోని పలు జెడ్పీ పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చాటారు. ఎంఈవో భాస్కర్ శర్మ ప్రదర్శనలు తిలకించారు. నోడల్ ఆఫీసర్ నిమ్మ రాజిరెడ్డి, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నియామకం

ముస్తాబాద్: ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ మండల లీగల్ అడ్వైజర్‌గా మండలకేంద్రానికి చెందిన గుడ్ల దినేశ్ నియామకమైనట్లు రాష్ట్ర చైల్డ్ ఉమెన్ ప్రొటెక్షన్ మెంబర్ కుసుమ కవిత తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయ సేవలు అందిస్తామని దినేశ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

డే కేర్ కేంద్రంలో చేరిన వృద్ధురాలు

ఎల్లారెడ్డిపేట: తన కొడుకు కోడలు అనారోగ్యంతో మృతిచెందగా ఒంటరిగా మిగిలిన వృద్ధురాలు మంగళవారం ఎల్లారెడ్డిపేటలోని వృద్ధుల సంక్షేమకేంద్రంలో చేరింది. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన ఏర్రెంకి బాలవ్వ కుమారుడు..కోడలు కొద్దిరోజుల క్రితం మృతిచెందారు. అప్పటి నుంచి బాలవ్వ తెలిసిన వారి ఇంట్లో ఉంటోంది. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ కొండాపూర్‌కు వెళ్లి బాలవ్వను డే కేర్ కేంద్రంలో చేర్పించారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

బోయినపల్లి: లాభార్తి సంపర్క్ అభియాన్‌పై కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం ఎడపల్లి, గంగాధర్ చారి, సుంకపాక ప్రభు, రెడ్డవేని రాజు, అమిరిశెట్టి గంగయ్య, శ్రీనివాసచారి, బోయిని ప్రసాద్, వినోద్, మహిపాల్, మోడీ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దిలోని మోత్కులకుంటలో చేపల మృత్యువాతపై మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు పర్శరాములు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చేపలమృతిపై అనుమానాలున్నాయని, దీనిపై విచారణ జరిపించాలని కోరాడు.

ఒకరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కులంపేరుతో వ్యక్తులను దూషిస్తే చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ భీం శర్మ అన్నారు. మండలకేంద్రంలో ఓ భూమి కొనుగోలు విషయంలో గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన నర్ర సాగర్‌రెడ్డి, సీఆర్పీఎఫ్ కానిస్టేబల్‌కు మధ్య జరిగిన పంచాయతీలో కులంపేరుతో దూషించినట్లు కానిస్టేబుల్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. సాగర్‌రెడ్డిని ఎల్లారెడ్డిపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై డీఎస్పీ మంగళవారం ఇరువర్గాల వాంగ్మూలం తీసుకొని సాక్షులను విచారించారు. అనంతరం నర్ర సాగర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు.

కానిస్టేబుల్‌పై దురుసు ప్రవర్తన

చందుర్తి(వేములవాడ): రోడ్డు పక్కన మద్యం తాగుతుండటంతో పాటు ప్రశ్నించిన కానిస్టేబుల్‌పై యువకులు దురుసుగా ప్రవర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రంలో సోమవారం అర్ధరాత్రి రోడ్డు పక్కనే మద్యం తాగుతున్న యువకులను పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వారిని అక్కడి నుంచి వెళ్లాలని సూచించాడు. దీంతో కానిస్టేబల్‌పై దురుసుగా ప్రవర్తించి అక్కడినుంచి పరారయ్యారు. వారిని పట్టుకునే క్రమంలోనే కానిస్టేబుల్ బైక్‌పై నుంచి అదుపుతప్పి కిందపడిపోయాడు. కాగా ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఈ విషయం తమదృష్టికి రాలేదని దాటవేశారు.

వాలీబాల్ కిట్ అందజేత

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లిలో వాలీబాల్ కిట్‌ను యువకులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, ఎస్సీసెల్ అధ్యక్షుడు రొండి రాజు చేతుల మీదుగా మంగళవారం కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు



ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన నాయకులు మంగళవారం తెలంగాణ భవన్‌లో కలిశారు. గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కోటా నుంచి నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మొడుసు దేవారెడ్డి కూతురు పెళ్లి ఆహ్వాన పత్రికను కేటీఆర్‌కు అందజేశారు. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మనవేని సత్యం, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, తదితరులున్నారు.

గ్యారంటీ పథకాల అమలుపై సంబరాలు



మహిళలకు స్వీట్లు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా గృహలక్ష్మి, ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలమేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజన్‌రావు, కొండల్‌రెడ్డి, తలారి నర్సింలు, వుచ్చిడి బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రకు తరలిరావాలి



మాట్లాడుతున్న గరిపల్లి ప్రభాకర్

వీర్నపల్లి: మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గునెకుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజరాజేశ్వర క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర కన్వీనర్ పార్టీ సీనియర్ నాయకుడు గరిపల్లి ప్రభాకర్ హాజరై మాట్లాడారు. మార్చి2న విజయ సంకల్ప యాత్ర కరీంనగర్ నియోజకవర్గంలో ప్రారంభమవుతున్నందున పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బోడ మల్లేశం, జనరల్ సెక్రెటరీ తిరుపతి, లకావత్ రాజు, దర్శిసింగ్, పీర్యా, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి'



సిరిసిల్లటౌన్: సీఐకి ఫిర్యాదు చేస్తున్న నేతలు



వేములవాడ రూరల్ : ఎస్సై మారుతికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎంపీ బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. టీపీసీసీ కార్యవర్గ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, కాముని వనిత తదితరులున్నారు.

వేములవాడరూరల్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మారుతికి ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, ఎల్లగౌడ్, సురేశ్, వేణు, శ్రీకాంత్ తదితరులున్నారు.

ముస్తాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మండలపోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు రాజు, మాజీ జెడ్పీటీసీ యాదగిరి గౌడ్, మాజీసర్పంచ్ కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: జిల్లా కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు కూస రవీందర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు తదితరులున్నారు.

వీర్నపల్లి: మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై రాజిరెడ్డికి ఎంపీ బండి సంజయ్‌పై ఫిర్యాదు చేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు చంద్రమౌళి, మండల కో ఆర్డినేటర్ నక్క శ్రీనివాస్, సీనియర్ నాయకులు తదితరులున్నారు.

గంభీరావుపేట: ఎంపీ బండి సంజయ్‌పై మండల కాంగ్రెస్ నాయకులు మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణశాఖ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రారెడ్డి, జిల్లా నాయకులు రాఘవేందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రాజవీర్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఎంపీ బండిసంజయ్‌పై ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు తూము జలపతి, మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, తర్రె లింగం ఉన్నారు.

దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డిపేట: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఎంపీ బండి సంజయ్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను పాత బస్టాండ్‌లో దహనం చేశారు. అనంతరం బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపీ బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొర్ర రవీందర్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకులపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొన్నం ప్రభాకర్ తల్లిపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. చల్లూరు కార్తీక్, తదితరులున్నారు

మత్తడికి మరమ్మతు

రుద్రంగి: మండలంలోని మానాలలో వానాకాలంలో కోమటి చెరువు మత్తడి తెగిపోయింది. రూ.22లక్షల నిధులు మంజూరు కావడంతో మంగళవారం వైస్ ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య నాయకులతో కలిసి మత్తడి మరమ్మతుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగావత్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ ఎలేటి చిన్నారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్యామ్ సుందర్, నాయకులు రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

వీర్నపల్లి: మండల కేంద్రంలోని శ్రీ కల్యాణ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. గుర్తు తెలి యని వ్యక్తులు హనుమాన్ ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా విచారణ చేపట్టారు.